క్లుప్తంగా

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సీఆర్‌టీ హిందీ, పీజీసీఆర్‌టీ నర్సింగ్ సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్‌ఓ సరస్వతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 23 సాయంత్రం 4గంటల వరకు పాఠశాలలో దరఖాస్తులను అందజేయాలని ఆమె కోరారు. సీఆర్‌టీ హిందీకి హెచ్‌పీటీ శిక్షణ, టెట్ తప్పనిసరి, పీజీసీఆర్‌టీ నర్సింగ్ పోస్టుకు బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు వెడల్పు తగ్గించాలని ర్యాలీ

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులను 100ఫీట్లు కాకుండా, 60ఫీట్ల వెడల్పు వరకే రోడ్డును ఏర్పాటు చేయాలంటూ శనివారం కేసముద్రం స్టేషన్, కేసముద్రంవిలేజ్‌కి చెందిన పలువురు గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ బట్టు శ్రీనివాస్‌తోపాటు, పలువురు మాట్లాడుతూ.. బైపాస్ రోడ్డు వెడల్పు కంటే, ఊరి మధ్యన అతి వెడల్పు చేయడం ద్వారా నివాసాలను కోల్పోవలసి వస్తుందన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారికి, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీకాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తరాల వీరేష్, బోగోజు నాగేశ్వరాచారి, వేణుగోపాలచారి, సామల నర్సయ్య, రేణికుంట్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అమలు

మహబూబాబాద్ రూరల్: పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను పటిష్టంగా అమలుచేసే ప్రక్రియను మొదలుపెట్టారు. ఇందులో భాగంగా స్థానిక నెహ్రూసెంటర్ నుంచి రైల్వేస్టేషన్ వైపునకు వెళ్లే మార్గంలో శనివారం నుంచి నో పార్కింగ్ విధానం అమలు చేస్తున్నారు. టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్సై నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ప్రధాన రోడ్డుపై మధ్య భాగంలో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయవద్దని స్థానికులకు సూచించారు.

కార్యదర్శిపై చర్య తీసుకోవాలి

మరిపెడ రూరల్: మండలంలోని రాంపురం కార్యదర్శి కొద్ది రోజులుగా వేధిస్తున్నాడని అదే గ్రామ పంచాయతీ పరిధిలోని లచ్చిరాంతండాకు చెందిన బాధితుడు గిరిజన దివ్యాంగుడు భూక్య రమేష్ దంపతులు ఆరోపించారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ తన తండ్రి మృతి అనంతరం వారసత్వంగా ఉన్న స్థిరాస్తిని తన పేరుపై మార్చుకునేందుకు స్థానిక పంచాయతీ కార్యదర్శి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. సదరు కార్యదర్శిపై చర్య తీసుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ ధరావత్ వెంకన్ననాయక్ అన్నారు. ఈనెల 26న హైదరాబాదులో జరుగనున్న సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వరీ భవనంలో జరిగిన సమావేశంలో వెంకన్ననాయక్ మాట్లాడుదారు. సమావేశంలో నాయకులు ధరావత్ మోతిలాల్ నాయక్, గుగులోత్ నందులాల్ నాయక్, మాలోత్ సురేష్ నాయక్, బాదావత్ రాంబాబునాయక్, వినోద్ నాయక్, బాలునాయక్ పాల్గొన్నారు.

జయశంకర్ విగ్రహం ఆవిష్కరణ



మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ ఉద్యమ కాలంలో స్వరాష్ట్ర ఆకాంక్షను రేకెత్తించిన వారిలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ప్రథముడని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహంను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వెంకన్న, నెహ్రూ, వెంకట్ రెడ్డి, లక్ష్మయ్య, విష్ణువర్ధన్, మైస శ్రీనివాస్, ఎండి. ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో అస్వస్థత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామానికి చెందిన బానోత్ రమేష్, సునీత దంపతుల కుమార్తె శ్రీదేవి శనివారం రాత్రి పాముకాటుకు గురి కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: ఏకశిల హోలి ఏంజిల్స్ హైస్కూల్‌లో యోగా వేడుకలు



డోర్నకల్: యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



గార్ల ఆశ్రమ పాఠశాలలో..



మహబూబాబాద్ రూరల్: ఆసనాలు వేస్తున్న జడ్జి అబ్దుల్ రఫీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్



గూడూరు: తీగలవేణి జెడ్పీహెచ్‌ఎస్‌లో..



తొర్రూరు: పోలీస్‌స్టేషన్‌లో..



నెహ్రూసెంటర్: యోగా చేస్తున్న వైద్య సిబ్బంది



కేసముద్రం: శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో..



పెద్దవంగరలో యోగా చేస్తున్న విద్యార్థులు



కురవి: సీరోలులో..



చిన్నగూడూరు: కేజీబీవీ పాఠశాలలో..

సొంతింటి కల సాకారం

మహబూబాబాద్ అర్బన్: ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కలసాకారమవుతుందని కాంగ్రెస్ నాయకుడు కాలసాని నర్సింహరెడ్డి అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి 1, 3వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను శనివారం అబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, రవి, ఎల్లయ్య రవీంద్రచారి, లింగస్వామి, పాపాచారి పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సొంతింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరా రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వీరారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు హరిసింగ్, నవీన్, గోపి, మహేష్, కొమురయ్య, లింగయ్య, యాదగిరి పాల్గొన్నారు.

డోర్నకల్: డోర్నకల్‌తోపాటు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజతో సందడి నెలకొందని కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్ పేర్కొన్నారు. స్థానిక పాతడోర్నకల్‌లో శనివారం రెడ్డెబోయిన శంకర్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు శీలం శ్రీనివాస్, నానియాదవ్, మాదా శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ పాల్గొన్నారు.

కురవి: ఇందిరమ్మ పథకం పేదలకు వరంగా మారిందని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. శనివారం సీరోలు మండలం చింతపల్లి గ్రామ శివారు కొత్తతండాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రమ్యశ్రీ, మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, జెరిపోతుల మహేష్‌గౌడ్, లక్ష్మీ నారాయణ, సైదులు, యాకయ్య పాల్గొన్నారు.

నిధులు వెంటనే విడుదల చేయాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, తెలంగాణ గిరిజన సంఘం భూక్య హరినాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం.నర్సింహస్వామికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మూడు సంవత్సరాలుగా స్కీం నిధులు పెండింగ్‌లో ఉండడం ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాల చదువులకు దూరమవుతున్నారన్నారు. నిధులు విడుదల చేయాలని లేని పక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాకయ్య, బానోత్ వెంకన్న, గంధసిరి జ్యోతిబసు, మందుల మహేందర్, కిషన్, రాకేష్, దిలీప్ పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక



ప్రభాకర్, అధ్యక్షుడు

నెహ్రూసెంటర్: అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న శనివారం తెలిపారు. సంఘం జిల్లా ప్రథమ మహాసభలు జిల్లా కేంద్రంలో నిర్వహించి కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పూనెం ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా ఊడుగుల రాములు, పల్లెల పాపారావు, ప్రధాన కార్యదర్శిగా ఆవుల కట్టయ్య, సహాయ కార్యదర్శులుగా ఈక భిక్షం, ఈరెల్లి కొమురయ్య, కోశాధికారిగా జక్కుల యాకయ్య, కార్యవర్గ సభ్యులుగా ముల్కురి జగ్గన్న, బొమ్మగాని ఎల్లయ్య, గద్దల వెంకటయ్య, కురుసం రంగయ్య, కంగాల పాపయ్య, కొమ్మాలు, రమేష్, వెంకన్న ఎన్నికయ్యారు.

జయశంకర్ ఆశయాలను నెరవేర్చాలి



గూడూరు: జయశంకర్ చిత్రంపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గార్ల: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తొర్రూరులో..

తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని బీఆర్ఎస్ నాయకులు శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నెరవేరేందుకు కృషి చేసిన జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. జయశంకర్ ఆశయాలను ప్రతీ ఒక్కరు నెరవేర్చాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

20క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుకున్న బియ్యం చూపిస్తున్న అధికారులు

గార్ల: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారులు పట్టుకొని ఇంటి యజమానిపై కేసు నమోదు చేశారు. జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల మండలంలో కొందరు రేషన్ బియ్యం అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి నల్లబజారుకు దారి మళ్లిస్తున్నారని పక్కా సమాచారం అందినట్లు తెలిపారు. ఈమేరకు గార్ల పోలీసులు, పౌరసరఫరాల శాఖ సంయుక్తంగా గార్ల మండలం సూర్యాతండాకు చెందిన భూక్యా గంగ ఇంట్లో శనివారం సోదాలు నిర్వహించారు. ఈక్రమంలో అక్రమంగా నిల్వ ఉన్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారాన్ని పసిగట్టిన అక్రమార్కులు పారిపోయినట్లు తెలిపారు. అక్రమ వ్యాపారం చేస్తున్న వారు ఖమ్మం జిల్లా కారేపల్లి మండలానికి చెందినవారిగా తెలిసిందన్నారు. అక్రమ పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకొని స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు. బియ్యంకు నిల్వ ఉంచిన ఇంటి యజమానులైన భూక్యా గంగ, భర్త వెంకట్రాంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. దాడుల్లో డీటీ రమేష్, ఏఎస్సై రవీందర్, కానిస్టేబుల్ ఎండీ.సిరాజ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో మలిశెట్టి వేణు, చిప్పరపల్లి వెంకన్న, పగడాల కృష్ణారెడ్డి, సొడం ఉపేందర్, దయ్యాల బాబుగౌడ్ పాల్గొన్నారు.

ఇల్లు మంజూరు.. కట్టుకోలేని దుస్థితి

మరిపెడ రూరల్: సొంతింటి కల నెరవేరబోతుందని ఆ కుటుంబం ఎంతో సంబుర పడ్డది. కానీ వీరి సంతోషాన్ని విధి వంచించింది. వివరాల ఇలా ఉన్నాయి.. మండలంలోని ఉల్లెపల్లి గ్రామానికి చెందిన చిదుముల వీరన్నది పేద కుటుంబం. ఈ క్రమంలో ప్రభుత్వం వీరికి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసింది. ఇంటిని నిర్మించుకుని కుటుంబంతో సంతోషంగా ఉండాలని కలలు కన్నారు. ఈ లోగా భర్త వీరన్న అనారోగ్యంతో వారం క్రితం మృతి చెందాడు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం దాచిన డబ్బులు వైద్య ఖర్చులకే అయిపోయాయి. చేతిలో చిల్లి గవ్వలేని దుస్థితి. ఇంటి పెద్దను కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబానికి దాతలు అపన్న హస్తం అందించి, ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు కట్టుకుని వారి కల సాకారం అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాసిరకం విత్తనాలు అమ్మారని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

మహబూబాబాద్ రూరల్: సన్నరకం వరి ధాన్యం విత్తనాలు ఇవ్వమంటే దొడ్డు రకం ధాన్యం విత్తనాలు ఇచ్చారని ఆరోపిస్తూ ఇచ్చారని జిల్లా కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఎదుట శనివారం బాధిత రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామ పంచాయతీ రైతులు గుగులోతు నాను, సురేష్, యాకుబ్, వెంకన్న, రమేష్, రాజు మాట్లాడుతూ.. సేవా కేంద్రంలో 25బస్తాల సన్నరకం ఆర్‌ఆర్‌ఆర్ ధాన్యం విత్తనాలు కొనుగోలు చేశామన్నారు. వాటిని నానబెట్టి తెరిచి చూసేసరికి అందులో కొంత మేరకు దొడ్డు రకం విత్తనాలు, కొంత మేరకు పొట్ట బెరుకులతో కూడిన ధాన్యం ఉందన్నారు. తమకు నకిలీ విత్తనాలు అమ్మారని ఇందుకు బాధ్యులైన షాపు యజమానిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బ్లూకోల్ట్స్ పీసీలు రహీం, రఘురాం సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా రైతులు ఆందోళన విరమించారు.

సంక్షిప్త సమాచారం

సీపీఐ గ్రామ కార్యదర్శిగా లింగ్యనాయక్

మహబూబాబాద్ రూరల్: మండలంలోని దామ్య తండా గ్రామ సీపీఐ కార్యదర్శిగా బానోత్ లింగ్యా నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడని సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ శనివారం తెలిపాడు.

ఆలయ వార్షికోత్సవం

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో గల శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. నామిరెడ్డి జాయింట్ ఫ్యామిలీ ట్రస్ట్ చైర్మన్ నామిరెడ్డి మహేంద్రాదేవి, సీతారాంరెడ్డి దంపతులు, ట్రస్టు సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

6వ తరగతి నుంచి ప్రవేశాలు చేపట్టాలి

నెల్లికుదురు: ప్రభుత్వం గురుకులాల్లో ప్రవేశాల కోసం 5వ తరగతి నుంచి కాకుండా 6వ తరగతి నుంచి చేపట్టాలని మండలంలోని వావిలాల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

హోటళ్ల తనిఖీ

కొత్తగూడ: మండలకేంద్రంలోని పలు హోటళ్లను, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లను శనివారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారికి నోటీసులు జారీ చేశారు. అధికారులు ధర్మేంద్ర, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

నెహ్రూసెంటర్: స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కొండ మురళీ చేసిన వ్యాఖ్యలు సరికాదని వెంటనే క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. కడియం రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక అవమానకరంగా మాట్లాడడం సరికాదన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ సమావేశంలో పులి శ్రీను, సీహెచ్ రాధ, సుధారాణి, ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు తాళ్లూరి సత్యనారాయణకు చెందిన పాడిగేదె గ్రామ శివారు జమ్మిబావి సమీపంలో మేతకు వెళ్లి అక్కడ తెగిపడిన విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె ఖరీదు రూ.90వేలు ఉంటుందని బాధితుడు విలపించాడు.

పెనుగొండలో ఆవు..

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామానికి చెందిన ముదిగిరి భీరయ్యకు చెందిన పశువులు శనివారం పంట భూమిలోకి మేత కోసం వెళ్లాయి. అక్కడ పడి విద్యుత్ తీగలకు ఆవు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.60వేల నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పైపులైన్ ఏర్పాటు

గూడూరు: ఎమ్మెల్యే సహకారంతో బోడచకృతండా వాసుల తాగునీటి సమస్య తీరుతుందని మాజీ సర్పంచ్ భర్త కట్ల భవాని విష్ణుగౌడ్, బోడ భద్రు అన్నారు. మండలంలోని వెంగంపేటలోని బోడచకృతండా మంచినీళ్ల బావినుంచి మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వరకు పైపులైను నిర్మాణానికి వారు శనివారం పూజ చేశారు.

జయప్రదం చేయండి

చిన్నగూడూరు: జిల్లా కేంద్రంలో నేడు(ఆదివారం) నిర్వహించే జీఎంపీఎస్ జిల్లా మూడో మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో సభ కరపత్రాలను ఆవిష్కరించారు.

ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌తో సాధ్యం

గూడూరు: ప్రజాసంక్షేమ పాలన కాంగ్రెస్ పాలనతోనే సాధ్యమవుతుందని, పేదింటి కల నెరవేరుతుందని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు.

ఓటును అమ్ముకోవద్దు

నెల్లికుదురు: ఓటును అమ్ముకుని ఐదేళ్లపాటు పార్టీ పేరు చెప్పుకుని గెలిచిన వారికి ఊడిగం చేయొద్దని మండల కేంద్రానికి చెందిన ఆకుల వెంకన్న ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక రంగనాయక స్వామి దేవాలయంలో శనివారం వెంకన్న ప్రత్యేక పూజలు నిర్వహించి ఓటు విలువను తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ

గంగారం: ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు అన్నారు.మండలంలోని మామిడిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజనిర్వహించారు. కార్యక్రమంలో కల్తి శేఖర్, జనగాం సురేష్, సుధాకర్, జనగాం విజయ్, ఏకయ్య పాల్గొన్నారు.

పేదలకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి



ఆందోళన చేస్తున్న స్థానికులు

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులోని డబుల్ బెడ్రూం ఇళ్లలోకి వెళ్లేందుకు శనివారం స్థానికులు యత్నించగా పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానికులు ఇళ్లలోకి వెళ్లారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు శ్రీనివాస్, పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. ఆర్డీఓ గణేష్ వారితో ఫోన్‌లో మాట్లాడి ఖాళీ చేయాలని వారికి సూచించారు. 45 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని, అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఖాళీ చేశారు. స్థానికుడు యాకూబ్ మాట్లాడుతూ.. తొర్రూరు పట్టణంలోని గోపాలగిరి రోడ్డులో 240ఇళ్లు నిర్మించి పేదలకు కేటాయించకుండా వదిలేశారని తెలిపారు. నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా పంపిణీ చేయకపోవడం శోచనీయమన్నారు.

ప్రయోగాత్మక విద్యతో నైపుణ్యాలు పెంపొందించాలి

పెద్దవంగర: ప్రయోగాత్మక విద్యతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందిచేలా ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాలని ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని ఎంఆర్సీలో బడిబాట అకాడమిక్ కార్యక్రమాలపై చిట్యాల క్లస్టర్ హెచ్‌ఎం విజయ్ కుమార్‌తో కలిసి మండలంలోని ఆయా గ్రామాల పాఠశాల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చొరవ తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. గతేడాది 1433 విద్యార్థులకు గాను ఈ ఏడాది 1563కు చేరిందన్నారు. ఈనెల 25నుంచి 30 తేదీల్లో బేస్‌లైన్ టెస్టులు నిర్వహించి, ఫలితాలను జూలై 15లోపు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అక్కడ పుర్రె, ఎముకలు, మహిళ చీర, ఇతర దుస్తులు లభ్యమయ్యాయి. సుమారు నెల రోజుల క్రితం సదరు మహిళ మృతి చెంది ఉండవచ్చని లేదా ఎవరైనా హత్యచేసి ఉంటారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రూరల్ ఎస్సై వి.దీపిక శనివారం కేసు వివరాలు వెల్లడించారు. రూరల్ బ్లూ కోల్ట్స్ పీసీలు హుస్సేన్, రాందాస్ శనిగపురం గ్రామ ఏరియాలో పెట్రోలింగ్ చేస్తుండగా పశువులను మేపే ఒక వ్యక్తి అక్కడ ఓ మహిళ బట్టలు, పుర్రె, ఎముకలు కనిపించాయని సమాచారం ఇచ్చాడన్నారు. శనిపురం గ్రామ శివారులోని తాళ్లపూసపల్లి రోడ్డు దగ్గర్లో గల గుట్టల చెట్ల పొదలో ఓ మనిషి పుర్రె, ఎముకలు ఉన్నాయని చెప్పాడన్నారు. వెంటనే తమ సిబ్బంది అక్కడికి వెళ్లి చూసి ఆ సమాచారాన్ని తెలియజేయగా ఘటన స్థలాన్ని సందర్శించి, నేర స్థలాన్ని పరిశీలించి బ్లూకోల్ట్స్ పీసీ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

మహబూబాబాద్ రూరల్: తండ్రికి కూతురు తలకొరివిపెట్టిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని అయోధ్య గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. అయోధ్య గ్రామానికి చెందిన ఉబ్బపెల్లి శ్రీను, మాధవి దంపతులకు రేవతి, మైత్రి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడే తల్లి మాధవి మృతి చెందగా శ్రీను అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. శనివారం రాత్రి పెద్ద కుమార్తె రేవతి తండ్రికి తలకొరివి పెట్టగా ఆదృశ్యాన్ని చూసిన గ్రామస్తులు, బంధువులు బోరున విలపించారు. తల్లిదండ్రులు శ్రీను, మాధవి మృతిచెందడంతో ఇద్దరు కుమార్తెలు అనాథలుగా మారారు.